క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

జి.కొండూరు: మండల పరిధి కవులూరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తామని ట్రస్టు ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, సాధారణ వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తామని చెప్పారు.

శ్మశానవాటికలో ముళ్ల పొదల తొలగింపు



ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ఫెర్రీ హిందూ శ్మశాన వాటికలో ముళ్ల పొదల తొలగింపు పనులను మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు శనివారం ప్రారంభించారు. ఇటీవలి కాలంలో శ్మశానంలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు దహన సంస్కార కార్యక్రమాలకు ఆటంకంగా మారాయని స్థానికులు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే జేసీబీ ఏర్పాటు చేసి ముళ్ల పొదలను తొలగింపజేశారు. వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు చేసేందుకు దేవదాయ శాఖ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ శనివారం తెలిపారు. హిందువులై ఉండి 30 ఏళ్ల వయస్సు పైబడి ఉండాలని, సత్ ప్రవర్తన కలిగి ఉండి పోలీస్ ఎంక్వయిరీ సర్టిఫికెట్, మెడికల్ ఫిట్ నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని ఈఓ చెప్పారు. ఆసక్తిగల వారు దేవస్థానం కార్యాలయం వద్ద అవసరమైన దరఖాస్తు పత్రాలను పొంది పూర్తి చేసి ఈ నెల 26వ తేదీలోగా జిల్లా దేవదాయ శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

అంకమ్మ, లక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం



చాట్రాయి: ఆరుగొలనుపేట గ్రామంలోని అంకమ్మ, లక్ష్మమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ఆదివాసీల దినోత్సవం

మైలవరం: మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల జీవన విధానాన్ని, వారికున్న ప్రకృతిపై ప్రేమను, పాడి పంటల అభివృద్ధి విధానాన్ని, స్వాతంత్య్ర ఉద్యమంలో వారి త్యాగాన్ని ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ వివరించారు. విద్యార్థులు గిరిజనుల వేషధారణతో అలరించారు. పాఠశాల కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



చాట్రాయి: చిత్తపూరు గ్రామంలో శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఎబెట్ మందు పిచికారీ చేశారు. గ్రామంలో మురుగునీటి నిల్వల్లో, కాలనీల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సోమశేఖర్, ఏఎన్ఎం సామ్రాజ్యం, ఎంఎల్‌హెచ్‌పీ వీరాస్వామి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి మాస కల్యాణం



తిరువూరు: నెమలిలోని వేణుగోపాల స్వామి మాస కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేణుగోపాల స్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. 21 మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు.

భీమేశ్వర కాలనీకి దారేది..

- కాలనీ ఏర్పడి పాతికేళ్లు దాటినా సరైన దారి లేదు
- ప్రైవేట్ వ్యక్తుల పొలాలు, ప్లాట్లలో నుంచి రాకపోకలు
- ప్రైవేట్ వ్యక్తులు ఆపేస్తే కాలనీకి రాకపోకలు బంద్
- తాగునీటి కష్టాలకు పరిష్కారం చూపని అధికారులు



జూపూడి భీమేశ్వర కాలనీకి ప్రైవేట్ వ్యక్తుల పొలంలో నుంచి ఏర్పాటు చేసిన రోడ్డు

ఇబ్రహీంపట్నం: జూపూడి గ్రామ పంచాయతీ పరిధి భీమేశ్వర కాలనీ ఏర్పాటై సుమారు 25 ఏళ్లు దాటుతోంది. కాలనీకి పక్కా రహదారి లేదు. ఓవైపు 65వ నంబర్ జాతీయ రహదారికి సమీపంలోని బీసీ కాలనీ నుంచి ప్రైవేట్ వ్యక్తుల పొలంలో, మరో వైపు లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డులో రియల్ ఎస్టేట్ వెంచర్‌లో నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అమధ్య కాలంలో బీసీ కాలనీ వైపు పొలాల్లోని దారిని యజమాని మూసివేయడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు భూమి యజమానిని బుజ్జగించడంతో మళ్లీ రాకపోకలు ప్రారంభమయ్యాయి.

పాతికేళ్లకు పైగా రహదారి కష్టాలు

జూపూడి భీమేశ్వరకాలనీ 1998లో ఏర్పాటు కాగా 324 మందికి ప్లాట్లు కేటాయించి పట్టాలు మంజూరు చేశారు. 65వ నంబర్ జాతీయ రహదారికి అత్యంత సమీపంలో ఉన్నందున రెండేళ్లలో పూర్తి స్థాయిలో కాలనీకి రూపరేఖలు వచ్చాయి. శివాలయానికి చెందిన 8 ఎకరాల దేవదాయ శాఖ భూమి కావడంతో 2022లో అప్పటి గ్రామ పంచాయతీ భీమేశ్వర కాలనీగా నామకరణం చేశారు. చుట్టూ వ్యవసాయ భూముల మధ్య కాలనీ ఏర్పాటు కావడంతో కాలనీకి ఎటువైపు చూసినా దారిలేదు.



కాలనీకి వెళ్లేందుకు తాత్కాలికంగా రియల్ వెంచర్ ప్లాట్లలో నుంచి ఏర్పాటు చేసుకున్న దారి

ప్రైవేట్ వ్యక్తుల పొలాల్లో నుంచి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అప్పట్లో ఎందరో అధికారులు, పాలకులకు ప్రైవేట్ వ్యక్తుల నుంచి దారి కొనుగోలు చేసి పక్కా రహదారి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరినా వారి కల సాకారం కాలేదు. పొలం యజమానుల దయాదాక్షిణ్యాలపై ప్రజల రాకపోకలు జరుగుతున్నాయి. వారు కన్నెర్ర జేస్తే రాకపోకలు బంద్ అయ్యే పరిస్థితులు ఉన్నాయి.

గిన్నెలతో పట్టుకుని బిందె నింపుకోవాలి..

కాలనీ ఏర్పడిన కొద్దికాలంలోనే రోడ్లు, తాగునీటి పైపులైన్, వీధి దీపాలు అప్పటి పంచాయతీ ఏర్పాటు చేసింది. కాలానుగుణంగా ఇళ్ల స్థలాలు, రోడ్లు మెరక కావడంతో పైపులైన్ ఐదడుగుల లోతులోకి వెళ్లాయి. ఏడేళ్ల కిందట అప్పటి సమస్యకు పరిష్కారంగా ఎన్టీటీపీఎస్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన పైపులైన్‌లకు ఆర్‌డబ్ల్యూఎస్ పంపింగ్ హౌస్ నుంచి నేరుగా వస్తున్న నీరు ప్రజల తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్నాయి. పైప్‌లైన్ నుంచి కుళాయిలకు అడుగు ఎత్తులో కూడా చుక్కనీరు రావడం లేదు. తాగునీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. పైపులకు ఆరంగుళాల ఎత్తులో ప్లాస్టిక్ పైపులు తొడిగి గిన్నెల ద్వారా నీరు పట్టుకుని బిందెల్లో నింపుకుంటున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించేవారు కరువయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. రహదారితో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి తాగునీటి కష్టాలు తీర్చాలని కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు.

బిందెడు నీటి కోసం పడరాని పాట్లు



భీమేశ్వర కాలనీకి తాగునీరు కరువైంది. కాలనీ ఏర్పడినప్పటి నుంచి తాగునీటి సమస్యకు సరైన పరిష్కారం చూపలేకపోతున్నారు. కొంతకాలం పైపులు లోతులో ఉన్నాయి అన్నారు. ఏడేళ్ల కిందట వేసిన నూతన పైప్‌లైన్లు ఎత్తయినట్లు చెబుతున్నారు. సక్రమంగా తాగునీరు పట్టుకునే భాగ్యం కలగడం లేదు.

– బానోత్ బాలనాగమ్మ, కాలనీ వాసి, జూపూడి

స్కూల్ బస్సు కోసం అర కిలోమీటరు వెళ్లాలి



కాలనీకి సరైన రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల స్కూల్ బస్సు కోసం ఉదయం, సాయంత్రం అర కిలోమీటరు దూరంలోని 65వ నంబర్ హైవే వరకు వెళ్లాల్సి వస్తోంది. సరైన రోడ్డు మార్గం ఉంటే కాలనీకి బస్సు నడుపుతామని చెబుతున్నారు. కాలనీకి సొంత రహదారి ఏర్పాటు చేయాలి.

– కామా జోత్స్న భీమేశ్వర కాలనీ, జూపూడి

రాఖీ పండుగ.. ఆత్మీయత నిండుగా



ఆగిరిపల్లిలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి



కొండపల్లిలో దివ్యాంగులకు రాఖీలు కట్టిన క్రాంతి హైస్కూల్ విద్యార్థినులు



బోస్కో డీ అడిక్షన్ సెంటర్‌లో రాఖీ వేడుకలు

ఆగిరిపల్లి: అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి ప్రతిరూపంగా నిలిచే రాఖీ పౌర్ణమిని నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. అక్క,చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు స్వగ్రామాలకు వచ్చారు. చేతులకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు అందుకున్నారు. నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలంటూ హారతులు పట్టారు. చెల్లెమ్మలు, అక్కయ్యలు సోదరులు ప్రేమతో బహుమతులు అందజేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఉల్లాసంగా గడిపారు. చిన్నపిల్లలతో పాటు, పెద్దలు కూడా సంతోషంగా పండగను జరుపుకున్నారు.

ముసునూరు: రాఖీ పండుగను శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పలువురు మహిళలు, బాలికలు, యువతులు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లోని తన పుట్టినింటిలో అన్నదమ్ములకు రాఖీ కట్టారు.

చాట్రాయి: సోదరీ, సోదరుల ప్రేమానురాగాల ఆత్మీయ బంధానికి అనుగుణంగా జరుపుకునే రాఖీ పండుగను శనివారం ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాఖీ షాపులు, స్వీటు షాపులు, పూల దుకాణాలు కిటకిటలాడాయి. ఉదయాన్నే ఆడపడుచులు తమ పుట్టినింటికి వెళ్లి రాఖీలు కట్టి అన్నదమ్ముల ప్రేమాభిమానాలు పొందారు.

దివ్యాంగులకు రాఖీలు కట్టిన విద్యార్థినులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని శ్రీ విద్యా సేవా సంస్థలో శనివారం రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. దివ్యాంగులకు స్థానిక క్రాంతి హైస్కూల్ విద్యార్థినులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూజివీడు: రామన్నగూడెంలోని నవజీవన్ బాలభవన్ బోస్కో డి అడిక్షన్ సెంటర్ లో బాలల కుటుంబ సభ్యులు, అక్క చెల్లెళ్లు పాల్గొని వారి తమ్ముళ్లకు, అన్నలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సెంటర్ ప్రోగ్రామ్ మేనేజర్ జక్కుల ఆంజనేయులు, సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

తిరువూరు: రాఖీపౌర్ణమి సందర్భంగా తిరువూరు రాజుపేట శ్రీఅష్టలక్ష్మీ దేవాలయంలో చండీయాగం నిర్వహించారు. తిరువూరు, గంపలగూడెం, ఊటుకూరు, కంభంపాడు గ్రామాల్లోని దేవాలయాల్లో జరిగిన విశేష పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తిరువూరు నియోజకవర్గంలో సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ కార్యక్రమం సందడిగా సాగింది.

అన్నదానానికి విరాళాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం నందిగామ పట్టణానికి చెందిన ఎ.రాఘవకృష్ణ రూ.10,116 ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావుకు అందజేశారు. అలాగే కంకిపాటి నీరజ్, బెల్లంకొండ స్వప్న రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

పసుపు కొమ్ముల అలంకారంలో కనకదుర్గమ్మ

నందిగామరూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లోని దేవీ ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో వేం చేసి ఉన్న కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లను ఆలయ అర్చకుడు రాజేష్ శర్మ పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు, అష్టోత్తర సహస్రనామ, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ప్రముఖుల శుభాకాంక్షలు



నూతన వధూవరులతో స్వామిదాసు, పార్టీ నాయకులు

విస్సన్నపేట: విస్సన్నపేట ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, రాజేష్ దంపతుల కుమారుడు వివాహ కార్యక్రమం శనివారం స్థానిక నూజివీడు రోడ్డులోని కల్యాణ మండపంలో జరిగింది. నూతన వధూవరులు లలిత్‌కుమార్, భాగ్యసిరితేజాలను పలువురు ప్రముఖులు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఎన్. సుధారాణి, నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, మాజీ ఎమ్మెల్యే కె. రక్షణనిధి, రామచంద్రారెడ్డి, చాట్రాయి మండల సీనియర్ నాయకుడు దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్టీల సమగ్ర స్థితిగతులకు కమిషన్ ఏర్పాటు చేయాలి

ఎస్టీ ఉద్యోగుల సంఘం డిమాండ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): షెడ్యూల్డ్ జాతుల(ఎస్టీ) జాబితాలోని 35 కులాల సమగ్ర స్థితిగతుల అధ్యయనం కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని ఎస్టీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవర కొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజనులుగా పిలిచే ఆదివాసీల విద్య, వైద్య, ఉపాధి ఇలా అన్ని రంగాల్లో స్థితిగతులను అధ్యయనం చేయాలన్నారు. కమిషన్ ఏర్పాటు చేసి సమగ్రంగా సమీక్షించాలన్నారు. ఉద్యోగ సంఘం నాయకులు కటారి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఎస్టీ భవన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రమేష్ నాయక్ మాట్లాడుతూ ఆదివాసీల్లోని ప్రతి కులం అన్ని రంగాల్లో సమాంతరంగా వృద్ధిలోకి రావడానికి కులాల సమూహ కార్పొరేషన్లను ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలన్నారు. సాల బోగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల్లోని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేష్, వివిధ బహుజన సంఘాల నాయకులు గుబ్బల నాగేశ్వరరావు, నెరుసు నాగమణి యాదవ్, కందికట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య వినాశనానికి, విధ్వంసానికి కారణమవుతున్న ఈవీఎంలను తొలగించి ఎన్నికలను పూర్తిగా బ్యాలెట్ విధానంలో నిర్వహించాలని వక్తలు డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజాస్వామ్యం గెలిచే బ్యాలెట్ పేపర్‌ను ఎన్నికల్లో వాడాలన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈవీఎం వద్దు , బ్యాలెట్ పేపరే ముద్దు అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు సంగటి మనోహర్ మహాజన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో దొంగ ఓట్ల నమోదు, ఎన్నికల్లో రిగ్గింగ్, అక్రమాలు జరిగినట్లు ఆధారాలతో దేశవ్యాప్త చర్చ జరుగుతోందన్నారు. ఈవీఎంలపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు జరిగితే సమీప భవిష్యత్‌లో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశం బలహీనపడే ప్రమాదం ఉందని, ప్రజాస్వామ్యం కుప్పకూలడం ఖాయమని హెచ్చరించారు. ప్రపంచ దేశాలను ఆదర్శంగా తీసుకుని పేపర్ బ్యాలెట్ వినియోగించుకోవాలన్నారు. ఈవీఎంలు వద్దు అనే అంశంపై దక్షిణ భారతదేశంలో నవంబర్ 26 వరకు చర్చలు, విశ్లేషణలు, సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని చలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సోషలిస్టు కూటమి జాతీయ కార్యదర్శి జైబాబు, ముస్లిం సమైక్య వేదిక నాయకులు షేక్ రజీజ్, షేక్ హుస్సేన్, కృష్ణారావు, లాయర్స్ ఫోరం నాయకులు నరసయ్య, కన్నా వెంకట్, వీరస్వామి, అజయ్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గడ్డి వాములు దగ్ధం

గండేపల్లి(కంచికచర్ల): పిడుగుపాటుకు రెండు వరిగడ్డి వాములు దగ్ధమైన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. అగ్నిమాపక కేంద్ర సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన కంతంనేని కోటేశ్వరరావుకు చెందిన వరిగడ్డి వామిపై పిడుగుపడింది. దీంతో రెండు గడ్డివాములకు మంటలు అంటుకోవడంతో వాములు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్ర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. రూ.70 వేలు ఆస్తి నష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

సుంకొల్లులో శ్లాబ్ కల్వర్టు నిర్మాణం ఎప్పుడో!

- శంకుస్థాపన చేసి ఏడాదిన్నర పూర్తి
- ప్రారంభంకాని పనులు



శ్లాబ్ కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం ఇదే

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో ఈదుల చెరువుకు వరదనీరు వెళ్లే వాగుపై శ్లాబ్ కల్వర్టుకు శంకుస్థాపన చేసి ఏడాదిన్నర పూర్తయినా ఇంత వరకు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని కాపుల బజారులో గంగానమ్మ గుడికి సమీపంలోని ఈ వాగుపై ఉన్న శ్లాబు కల్వర్టు రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తన హయాంలో ఇక్కడ శ్లాబ్ కల్వర్టు నిర్మించేందుకు గాను రూ.26 లక్షల నిధులు మంజూరు చేయించి గతేడాది ఫిబ్రవరి 11న శ్లాబ్‌కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత 40 రోజులకే ఎన్నికల కోడ్ రావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. అనంతరం ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో ఈ పనిని చేపట్టకుండా పక్కన పెట్టేశారు. దీంతో స్థానికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా రాకపోకలు సాగించేందుకు పైపులు వేసి గ్రావెల్ పోసినప్పటికి వర్షాలకు అది కాస్తా కోతకు గురికావడంతో ట్రాక్టర్లు, లారీలు వెళ్లడానికి వీలు పడటం లేదు. ఈ నేపథ్యంలో ఇక్కడ శ్లాబ్ కల్వర్టు పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి: సీపీఐ

నూజివీడు: చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని సీపీఐ పట్టణ అధ్యక్షుడు చాట్ల పుల్లారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాల సరిహద్దుల మార్పులు, జిల్లాల పేర్ల మార్పులు తదితర అంశాలపై ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించిన నేపథ్యంలో ఉప సంఘంలోని సభ్యులు అన్ని ప్రాంతాల్లోని ప్రజల డిమాండ్‌లకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో కలపొద్దని కోరుతూ గతంలో తాము ఉద్యమాన్ని నిర్వహించామని, 10 వేల మందితో సంతకాల సేకరణ సైతం చేశామన్నారు. అంతేగాకుండా నూజివీడు ప్రాంతం సీఆర్‌డీఏ పరిధిలో ఉందని, ఆగిరిపల్లి మండలంలో నుంచి అవుటర్ రింగ్‌రోడ్డు వెళ్తుందన్నారు. ప్రస్తుతం మంత్రి వర్గ ఉప సంఘాన్ని నెలరోజుల్లో నివేదికను ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించిన నేపథ్యంలో నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపి ఇచ్చిన హామీని నెరవేర్చాలని పుల్లారావు కోరారు.

జాతీయ రహదారిపై బారికేడ్ల ఏర్పాటు



కుంటముక్కల గ్రామం వద్ద జాతీయ రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ సతీష్‌కుమార్

జి.కొండూరు: మైనర్లు వాహనాలను నడపడం వల్లన ప్రమాదాల బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారని, తల్లిదండ్రులెవరూ మైనర్లకు వాహనాలను ఇవ్వద్దని ఎస్ఐ సతీష్‌కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా మండల పరిధిలోని నేషనల్ హైవే, స్టేట్ హైవేలపై పలుచోట్ల ఇనుప బారికేడ్లు, రేడియం స్టిక్కర్లను అంటించిన ప్లాస్టిక్ డ్రమ్ములను శనివారం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలను నడిపినా, అసంబద్ధ హారన్‌లు మోగించినా, రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపినా అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపితే రూ. వేయి జరిమానా, డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు రూ.10 వేలు జరిమానా, జైలు శిక్ష విధిస్తారని వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు.

గ్రీన్‌మ్యాటే వసతి గృహానికి ప్రహరీ



గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహం ముందు భాగంలో కట్టిన గ్రీన్ మ్యాట్

నూజివీడు: మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహం ప్రహరీ కూలి ఏడాది కావస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. గత ఏడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షానికి హాస్టల్ భవనం ముందు భాగంలో ఉన్న ప్రహరీ కూలిపోయింది. అప్పటి నుంచి నూతన ప్రహరీని నిర్మించకుండా పాలకులు అలాగే గాలికొదిలేశారు. దీంతో విద్యార్థులు చేసేదేమి లేక గ్రీన్ పట్టా అడ్డం కట్టుకొని రోజులు గడుపుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో పాములు వస్తున్నాయని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గమైనప్పటికీ పట్టించుకోకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పడిపోయిన గోడ స్థానంలో నూతన ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

కంచికచర్ల: పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల మూడో సంవత్సరం సీఎస్ఎం, సీఐసీ, సైబర్ సెక్యూరిటీ విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో భాగంగా హైదరాబాద్‌లోని సీ డాక్(సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్) హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సంస్థను సందర్శించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ శనివారం తెలిపారు. సీడాక్ జాయింట్ డైరెక్టర్ సాధు శ్రీనివాస్ విద్యార్థులకు సీడాక్‌లో అత్యాధునిక టెక్నాలజీతో అందుబాటులో ఉన్న 3డీ ప్రింటింగ్ ల్యాబ్‌తో పాటు బిగ్ డేటా ల్యాబ్, క్వాంటింగ్ కంప్యూటింగ్ ల్యాబ్, ఈ శిక్షణ, విశ్లేషణ యాప్ తదితర అంశాల గురించి వివరించారన్నారు. విద్యార్థులు సీ డాక్ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్ చేయడానికి కావలసిన విధి విధానాలను తెలియజేశారని పేర్కొన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ సెక్యూరిటీలో పట్టు సాధిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. సీ డాక్ మెంబర్స్ కుమార్, మాధుర్య, వంశీ సంస్థ పురోగతిని, ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో ఈ సెంటర్‌లో పరిశోధన ఏ విధంగా జరుగుతుందో విద్యార్థులకు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇటువంటి ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా రీసెంట్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.